

రామాయంపేట పట్టణంలో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేయడానికి సిద్ధంగా ఉన్న శిలాఫలకాలు

# రామాయంపేటలో రెవెన్యూ పండుగ

## డివిజన్ ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు పూర్తి

- నాలుగు మండలాలతో రెవెన్యూ డివిజన్ ఏర్పాటు
- నేడు ప్రారంభించనున్న మంత్రి హరీశ్‌రావు

మెదక్, అక్టోబర్ 1(నమస్తే తెలంగాణ): మెదక్ జిల్లాలో రామాయంపేట రెవెన్యూ డివిజన్ ప్రారంభోత్సవానికి అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తిచేసింది. నేడు రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్య శాఖల మంత్రి తన్నీరు హరీశ్‌రావు లాంఛనంగా ప్రారంభించనున్నారు. రెవెన్యూ డివిజన్ అవతరిస్తున్న తరుణంలో రామాయంపేట వాసులు పెద్దఎత్తున సంబురాలు చేసుకునేందుకు సిద్ధమయ్యారు. ఆగస్టు 23న సీఎం కేసీఆర్ మెదక్‌లో నిర్వహించిన శంఖారావం బహిరంగ సభలో రామాయంపేటను రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. మాటిచ్చిన 24 గంటల్లోపే ప్రభుత్వం ప్రాథమిక నోటిఫికేషన్ విడుదల చేసింది. రామాయంపేట రెవెన్యూ డివిజన్ ఏర్పాటుపై ఏవైనా అభ్యంతరాలు, సూచనలు ఉంటే స్థానికులు 15 రోజుల్లో కలెక్టర్లకు దరఖాస్తులు అందించవచ్చని నోటిఫికేషన్ ఇచ్చారు. అనంతరం జీవో 284ను విడుదల చేశారు. మెదక్ రెవెన్యూ డివిజన్‌లోని రామాయంపేట, నిజాంపేట, చిన్నశంకరంపేట మండలాలు, తూప్రాన్ రెవెన్యూ డివిజన్‌లో నార్సింగి మండలాన్ని వేరు చేసి రామాయంపేట కేంద్రంగా మరో రెవెన్యూ డివిజన్‌ను ఏర్పాటుచేశారు.

### రెవెన్యూ డివిజన్‌లో జనాభా

రామాయంపేట రెవెన్యూ డివిజన్‌లో 1,24,556 మంది జనాభా ఉండనున్నది. ఇందులో రామాయంపేట మండలంలో పురుషులు 20,922 మంది, మహిళలు 21,475 మంది మొత్తం 42,397 మంది ఉన్నారు. నిజాంపేట మండలంలో పురుషులు 13,040 మంది, మహిళలు 13,409 మంది, మొత్తం 26,449 మంది ఉన్నారు. నార్సింగి మండలంలో పురుషులు 8272 మంది, మహిళలు 8554 మంది మొత్తం 16,826 మంది ఉన్నారు. చిన్నశంకరంపేట మండలంలో పురుషులు 19,113 మంది, మహిళలు 19,771 మంది మొత్తం 38,884 మంది ఉన్నారు. మొత్తంగా పురుషులు 61,347 మంది, మహిళలు 63,209 మంది ఉన్నారు. మొత్తం 1,24,556 మంది జనాభా ఉంది.



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న రామాయంపేట డిగ్రీ కళాశాల

### ఫలించిన ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి కృషి

రామాయంపేట రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలని మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి పలుమార్లు సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావు దృష్టికి తీసుకెళ్లారు. ఆగస్టు 23న మెదక్‌లో జరిగిన ప్రగతి శంఖారావం బహిరంగ సభలో స్థానిక ఎమ్మెల్యే, సీఎం కేసీఆర్ దగ్గర ఇదే అంశాన్ని ప్రస్తావించారు. వెంటనే స్పందించిన సీఎం రామాయంపేటను రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించారు. ఈ మేరకు రామాయంపేట, నిజాంపేట, చిన్నశంకరంపేట, నార్సింగి మండలాలను కలిపి రామాయంపేట రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు వచ్చాయి. మెదక్ జిల్లాలో ఇప్పటికే మెదక్‌తో పాటు నర్సాపూర్, తూప్రాన్ రెవెన్యూ డివిజన్లు ఉన్నాయి.

### మెదక్ జిల్లాలో నాలుగు రెవెన్యూ డివిజన్లు

మెదక్ జిల్లాలో ఇప్పటికే మూడు రెవెన్యూ డివిజన్ కేంద్రాలున్నాయి. తాజాగా రామాయంపేట డివిజన్ ఏర్పాటు అవుతున్నది. మెదక్ డివిజన్‌లో 10 మండలాలు మెదక్, హవేళీఘనపూర్, పాపన్నపేట, టేక్మాల్, అల్లాదుర్గం, రేగోడ్, పెద్దశంకరంపేట, రామాయంపేట్, నిజాంపేట్, చిన్నశంకరంపేట మండలాలు ఉన్నాయి. రామాయంపేట డివిజన్ ఏర్పాటుతో మెదక్‌లోని రామాయంపేట, నిజాంపేట్, చిన్నశంకరంపేట మండలాలు కలువనున్నాయి. తూప్రాన్ రెవెన్యూ డివిజన్‌లో తూప్రాన్, మనోహరాబాద్, వెల్దుర్తి, చేగుంట, నార్సింగి, మాసాయిపేట మండలాలు ఉన్నాయి. ఇందులో నుంచి నార్సింగి మండలం రామాయంపేట రెవెన్యూ డివిజన్‌లో కలుస్తున్నది. నర్సాపూర్ రెవెన్యూ డివిజన్‌లో నర్సాపూర్, కౌడిపల్లి, శివ్వంపేట్, కొల్చారం, చిలిపిచేడ్ మండలాలు ఉన్నాయి.




### చకచకా ఏర్పాట్లు పూర్తి

రామాయంపేట రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు పనులు చకచకా జరుగుతున్నాయి. రెవెన్యూ డివిజన్‌కు అవసరమైన మౌలిక సదుపాయల కల్పనపై ప్రత్యేక దృష్టిని సారిస్తున్నారు. రామాయంపేటలోని గురుకుల హాస్టల్ భవనం పక్కన ఆర్డీవో కార్యాలయాన్ని ఏర్పాటు చేసి రంగులద్ది, బోర్డులు ఏర్పాటు చేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేశారు. మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, కలెక్టర్ రాజర్షి షా, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు తుది ఏర్పాట్లను పర్యవేక్షించారు.



నూతనంగా మున్సిపల్ కార్యాలయ భవన శంకుస్థాపనకు స్థలాన్ని సిద్ధం చేసిన నాయకులు

### నేడు మంత్రి హరీశ్‌రావు ప్రారంభిస్తారు



రామాయంపేట రెవెన్యూ డివిజన్ కేంద్రాన్ని మంత్రి హరీశ్‌రావు నేడు ప్రారంభిస్తారు. ఇందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. గురుకుల హాస్టల్ పక్కన ఆర్డీవో కార్యాలయాన్ని ఏర్పాటుచేశాం. రామాయంపేట ప్రజల ఎన్నో ఏండ్ల కల నెరవేరబోతున్నది. రామాయంపేటతో పాటు నిజాంపేట్, చిన్నశంకరంపేట, నార్సింగి మండలాలతో రెవెన్యూ డివిజన్ కేంద్రం ఉండబోతున్నది. రామాయంపేట రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేసినందుకు సీఎం కేసీఆర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు. – ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి



మున్సిపల్ స్థలాన్ని పరిశీలిస్తున్న బీఆర్ఎస్ నాయకులు, ఇఫ్కో డైరెక్టర్

## మంత్రి పర్యటనకు సర్వం సిద్ధం

- రూ.45 కోట్ల నిధులతో శంకుస్థాపనలు
- మున్సిపల్ భవనానికి శంకుస్థాపన, డిగ్రీ కళాశాల, పేట సబ్ డివిజన్, పీఆర్, ఆర్డీవో కార్యాలయ భవనాలు ప్రారంభం
- రామాయంపేటలో సీసీ రోడ్ల నిర్మాణం

రామాయంపేట, అక్టోబర్ 1: రామాయంపేట రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటవడంతో సబ్ డివిజన్ కార్యాలయాల ప్రారంభోత్సవాలకు మంత్రి తన్నీరు హరీశ్‌రావు రానున్నారు. ఆదివారం రామాయంపేట పట్టణాన్ని బీఆర్ఎస్ నాయకులు సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. రెవెన్యూ డివిజన్ కార్యాలయం, డిగ్రీ కళాశాల, ఆర్డీవో కార్యాలయం, పీఆర్ కార్యాలయాన్ని ముస్తాబు చేశారు. పట్టణంలోని సీసీ రోడ్లు, 40 ఫీట్ల వెడల్పుతో సీసీ రోడ్డు మధ్యలో లైటింగ్, డివైడర్ ప్రారంభం చేయనున్నారు. మున్సిపల్ భవన శంకుస్థాపనకు పాత ఐబీని కూల్చివేసి ఆ స్థలాన్ని చదును చేయించారు. ఆర్డీవో, పీఆర్ కార్యాలయాలకు వెళ్లేందుకు సీసీ రోడ్డును వేయిస్తున్నారు. నేడు మంత్రి హరీశ్‌రావు అభివృద్ధి పనులను ప్రారంభించనున్నారు. ఇఫ్కో డైరెక్టర్ దేవేందర్‌రెడ్డి, చైర్మన్ జితేందర్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ బాదె చంద్రం, సరాఫ్ యాదగిరి, వైస్ చైర్మన్ పుట్టి విజయలక్ష్మి, నాయకులు పుట్టి యాదగిరి, గజవాడ నాగరాజు, ఐలయ్య, మల్లేశంలు దగ్గరుండి పనులు చేయిస్తున్నారు. సోమవారం గాంధీ జయంతి సందర్భంగా మంత్రి జిల్లా కేంద్రంలో పర్యటించి, పనులు ప్రారంభించిన తర్వాత మధ్యాహ్నం రెండు గంటలకు రామాయంపేటకు రానున్నట్లు తెలిపారు. ఇక్కడ పలు అభివృద్ధి పనులతో పాటు రెవెన్యూ కార్యాలయం, డిగ్రీ కళాశాల, ఆర్డీవో, పీఆర్ కార్యాలయాలను ప్రారంభించనున్నట్లు స్థానిక నాయకులు తెలిపారు.

## మంత్రి పర్యటనను విజయవంతం చేయాలి

- ఇఫ్కో డైరెక్టర్ దేవేందర్‌రెడ్డి

రామాయంపేట, అక్టోబర్ 1: ప్రభుత్వ భవనాల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలను విజయవంతం చేయాలని ఇఫ్కో డైరెక్టర్ దేవేందర్‌రెడ్డి అన్నారు. రామాయంపేటకు రెవెన్యూ డివిజన్ మంజూరైన విషయం తెలిసిందే. ఆదివారం రామాయంపేట పట్టణంలోని బీఆర్ఎస్ క్యాంపు కార్యాలయంలో రెండు మండలాల బీఆర్ఎస్ నాయకులకు దిశానిర్దేశం చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. అందరి అభిప్రాయం మేరకే రామాయంపేట డివిజన్ ఏర్పాటు కానున్నదని, సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావు నేతృత్వంలో డివిజన్ ఏర్పాటై కార్యాలయాలు ప్రారంభించనున్నారని తెలిపారు. ఈ కార్యక్రమాలకు డివిజన్‌లోని మండలాల వాసులు అధిక సంఖ్యలో హాజరై మంత్రి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ముందుగా నిజాంపేట మండంలోని బీఆర్ఎస్ కార్యాలయం ప్రారంభంతో పాటు రామాయంపేటలోని వివేకానంద విగ్రహం నుంచి భారీ బైక్ ర్యాలీతో బీసీ కాలనీ రోడ్డుకు చేరుకుని శిలాఫలకాలను మంత్రి ఆవిష్కరిస్తారన్నారు. అక్కడి నుంచి డివిజన్ కేంద్రంలోని ఆర్డీవో, డిగ్రీ కళాశాల, మున్సిపల్ కార్యాలయ భవనానికి భూమిపూజ చేస్తారని పేర్కొన్నారు. అనంతరం పట్టణంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో ఇఫ్కో డైరెక్టర్ దేవేందర్‌రెడ్డి తోపాటు నిజాంపేట ఎంపీపీ దేశెటి సిద్ధరాములు, రామాయంపేట మున్సిపల్ చైర్మన్ పల్లె జితేందర్‌గౌడ్, బీఆర్ఎస్ నిజాంపేట మండల, పట్టణాధ్యక్షుడు పరుపాటి సుధాకర్‌రెడ్డి, చలిమేటి నాగరాజు, సరాఫ్ యాదగిరి, గజవాడ నాగరాజు, సొసైటీ చైర్మన్ చంద్రం, బాల్‌రెడ్డి, గౌస్, అబ్దుల్, బాలనర్సయ్య, రెడ్డిశెట్టి రవీందర్, మెట్టు యాదగిరి, లచ్చపేట రామాగౌడ్ తదితరులు ఉన్నారు.




సిద్దిపేటలో ప్రవచనాలను బోధిస్తున్న చాగంటి కోటేశ్వరరావు




## అసూయను గెలిస్తే జీవితం ప్రశాంతం

- దయ, ఓర్పు, శాంతి గుణాలు కలిగి ఉండాలి
- ప్రముఖ ప్రవచన కర్త బ్రహ్మర్షి చాగంటి కోటేశ్వరరావు

సిద్దిపేట, అక్టోబర్ 1: ప్రతి మనిషి దయ, ఓర్పు, శాంతి గుణాలు కలిగి ఉండాలని, అసూయను గెలువకపోతే జీవితం దుర్భరంగా ఉంటుందని బ్రహ్మర్షి చాగంటి కోటేశ్వరరావు అన్నారు. సిద్దిపేట డిగ్రీ కళాశాల మైదానంలో ఆదివారం రెండో రోజు మానవీయ విలువలపై ప్రవచనాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసూయను గెలువగలిగినప్పుడు ప్రతి మనిషి జీవితం ప్రశాంతంగా ఉంటుందన్నారు. ప్రతిఒక్కరూ చెడు గుణాలను వదులుకోవాలన్నారు. ఆరోగ్యకర పోటీతో ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చన్నారు. ప్రయత్నం చేయడం, కష్టపడడంతో విజయం సాధించవచ్చన్నారు. గురువు జ్ఞానాన్ని అందించి, సమాజ అభ్యుదయానికి కారకుడు అవుతాడన్నారు. ప్రతి గురువు ఎలాంటి భేదం లేకుండా తన శిష్యులకు జ్ఞానాన్ని అందిస్తాడన్నారు. ప్రతిఒక్కరూ రాగ ద్వేషాలకు అతీతంగా ప్రేమతో జీవించాలన్నారు. రెండో రోజు సంగీత విభావరిని ఏర్పాటు చేశారు. నృత్య ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమం ప్రారంభానికి ముందు భరతనాట్యం, కూచిపూడి నృత్యాలు చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలను ప్రజలు ఆసక్తిగా తిలకించారు. ప్రవచనాల కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా జడ్జి రఘురామ్, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



ప్రవచనాల కార్యక్రమానికి హాజరైన జిల్లా జడ్జి రఘురామ్



మిరుదొడ్డి మండలం మోతెలో నూతన గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ ప్రభాకర్‌రెడ్డి

## పేదల సంక్షేమమే ధ్యేయం

- మెదక్ ఎంపీ, బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డి
- భూంపల్లిలో డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల పట్టాలు అందజేత

మిరుదొడ్డి (అక్బర్‌పేట-భూంపల్లి), అక్టోబర్ 1: స్వరాష్ట్రంలో పేదల సంక్షేమమే ధ్యేయంగా సీఎం కేసీఆర్ అనేక సంక్షేమ పథకాలు అమలుచేస్తున్నారని మెదక్ ఎంపీ, బీఆర్ఎస్ పార్టీ దుబ్బాక ఎమ్మెల్యే అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. ఆదివారం అక్బర్‌పేట-భూంపల్లి మండలంలోని మోతెలో సర్పంచ్ కాలేరు శ్రీనివాస్ అధ్యక్షతన రూ.26 లక్షలతో నిర్మించిన పంచాయతీ భవనం, ఎస్సీ కమ్యూనిటీ హాల్ ప్రహరీ, భూంపల్లిలో బక్కి భాగ్యమ్మ వెంకటయ్య అధ్యక్షతన రూ.69 లక్షలతో మనఊరు- మనబడిలో నిర్మించిన ప్రాథమిక పాఠశాల నూతన భవనం, రూ.26 లక్షలతో పద్మశాలీ, నాయి బ్రాహ్మణ కులాలకు చెందిన కమ్యూనిటీ భవనాలు, రూ.25 లక్షలతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సబ్ సెంటర్, రూ.8.25 కోట్లతో నిర్మించిన 165 డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను ప్రారంభించారు. అర్హులకు జడ్పీ చైర్మన్ రోజా శర్మ, రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యలతో కలిసి పట్టాలు అందజేశారు. ఈ సందర్భంగా కొత్త ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ దేశంలోని ఏ రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా సంక్షేమ పథకాలు అమలుచేస్తూ ప్రజల గుడెల్లో సీఎం కేసీఆర్ గూడు కట్టుకున్నారన్నారు. రాష్ట్ర ప్రజల అభ్యున్నతికి సీఎం కేసీఆర్ రాష్ట్రంలో పలు సాగు నీటి ప్రాజెక్టులు నిర్మించి, రైతులను ఆర్థికంగా రాజులను చేస్తున్నారన్నారు. కొన్నేండ్ల నాటి నుంచి నీరు లేక వెలవెల బోయిన కూడవెల్లి వాగు నేడు సీఎం కేసీఆర్ దయతో జీవ నదిని తలపిస్తున్నదన్నారు. నిరంతరం నీటితో ప్రవహిస్తున్నదన్నారు. ప్రజల బాధలు తెలిసిన వ్యక్తి రాష్ట్రంలో ఉంటే సుభిక్షంగా ఉంటుందన్నారు.

### సీఎం కేసీఆర్ సల్లంగుండాలి



మా గరీబోళ్లకు ఇండ్లు కటించి, ఇంటిలోకి తోలిన సీఎం కేసీఆర్ సారు సల్లంగుండాలి. శాన రోజుల నుంచి ఎండలో ఎండుతూ, వానలో నానుతూ పిల్లతో బతికినం. గిప్పుడైతే సీఎం కేసీఆర్ సారు మాకు డబుల్ బెడ్ రూం ఇండ్లను ఇయ్యడం చాలా సంతోషం. నా జీవితాంతం సీఎం కేసీఆర్ సారు ఎంటనే ఉంటా.

– చుక్క కనకవ్వ, భూంపల్లి

### సీఎం సారుకు కృతజ్ఞతలు



ఏండ్ల కొద్ది ఇల్లులేక ఎన్నో ఇబ్బందులు పడ్డాం. సీఎం కేసీఆర్ మాకు రూ.5 లక్షలతో డబుల్ బెడ్ రూం ఇండ్లు కట్టించి, మాకు ఇయ్యాల్ల ఇచ్చిండు. మాలాంటి పేదల్లోకు సీఎం కేసీఆర్ సారు ఇండ్లు ఇయ్యడం చాలా సంతోషంగా ఉంది. సీఎం కేసీఆర్ సార్ రుణాన్ని బతికి ఉన్నంత కాలం తీర్చుకుంటాను

– నీల మమత, భూంపల్లి

### ప్రతిపక్షాల మాటలు నమ్మొద్దు

వచ్చే ఎన్నికల్లో ప్రతిపక్ష పార్టీల నాయకులు చెప్పే కల్లబొల్లి మాటలు నమ్మి మోసపోతే మళ్లీ గోస పడాల్సిన పరిస్థితి వస్తుందన్నారు. దుబ్బాక ఎన్నికల్లో ఎమ్మెల్యే రఘునందన్ రావు ప్రజలకు కల్లబొల్లి మాటలు చెప్పి గద్దెనెక్కినంక ఏ ఒక్క పనైనా చేశాడా అని ప్రశ్నించారు. చీరె, సారెలకు ప్రజలు మభ్య పడకుండా ప్రజల మనిషి సీఎం కేసీఆర్‌ను మూడోసారీ సీఎంగా చేయాలని కోరారు. కారు గుర్తుకు ఓటేసి తనను ప్రజలు ఆశీర్వదిస్తే వారికి సేవకుడిగా ఉంటూ పల్లెలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గజ్జల సాయిలు, జడ్పీటీసీ సూకురి లక్ష్మీలింగం, దుబ్బాక ఆత్మ కమిటీ చైర్మన్ నమిలే భాస్కరాచారి, వైస్ ఎంపీపీ పోలీసుల రాజులు, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు తుమ్మల బాల్‌రాజు, ఎంపీటీసీ ఉమారాణి బాలాగౌడ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జీడిపల్లి రవి, ఉప సర్పంచ్ ప్రభాకర్, పార్టీ నాయకులు పంజాల శ్రీనివాస్ గౌడ్, బోయ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



భూంపల్లిలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి